'వరలక్ష్మి' సెల్ఫీలకు ఆహ్వానం

నేడు శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం జరుపుకునే మహిళలూ.. మీ ఫొటోలను 'సాక్షి' పత్రికలో చూసుకోవాలనుకుంటున్నారా.. ఎందుకు ఆలస్యం.. మీరు పూజలో కూర్చున్న ఫొటో సెల్ఫీ తీసి ఈ కింద నంబర్‌కు వాట్సప్ చేయండి. శనివారం సంచికలో ప్రచురిస్తాం. సెల్ఫీ ఫొటోతో పాటు మీ పేరు, చిరునామా కూడా పంపాలి.

81060 22530





ఇలా రండి.. విహరించండి

- సాగర్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసుల చర్యలు
- రూట్‌మ్యాప్ విడుదల

- 10లో

న్యూస్‌రీల్

ఉత్తమ గ్రామ పంచాయతీగా కాట్రేవ్



అవార్డు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి శివకుమార్

చౌటుప్పల్ రూరల్: మండలంలోని కాట్రేవ్ గ్రామానికి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు చేపట్టిన పచ్చదనం-స్వచ్ఛదనం కార్యాక్రమాన్ని కాట్రేవ్ గ్రామంలో పకడ్బందీగా అమలు చేశారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును అందుకున్నారు. గ్రామంలో పరిశుభ్రతను పాటించడంలో కాట్రేవ్ గ్రామం జిల్లాలోనే మొదటి స్థానంలో ఉండడం గర్వకారణమని మాజీ సర్పంచ్ బచ్చ రామకృష్ణ అన్నారు.

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

రామన్నపేట : పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొ మాట్లాడారు. పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థాలతో మూసీ జలాలు కలుషితమైన ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మూసీ ప్రక్షాళన చేయాలని, మూసీ కాలువల ద్వారా గోదావరి జలాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందరభంగా గ్రామంలోని 12 కుటుంబాలు సీపీఎంలో చేరాయి. కూరెళ్ల నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మేక అశోక్ రెడ్డి, జెల్లెల పెంటయ్య, మాటూరి బాలరాజు, బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, బోయిని ఆనంద్, మామిడి వెంకట్‌రెడ్డి, బల్గూరి అంజయ్య, కల్లూరి నాగేష్, బావండ్లపల్లి బాలరాజు, గన్నెబోయిన విజయభాస్కర్ రశీద్, సైదులు, తొల్పునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి నివాళి



శ్రీకాంతాచారి ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మోత్కూరు : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంతాచారి జయంతిని గురువారం మోత్కూరు పట్టణంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం శ్రీకాంతాచారి చేసిన ప్రాణత్యాగం గొప్పదన్నారు. మలిదశ ఉద్యమకారులను స్వాతంత్య్ర సమరయోధులుగా గుర్తించడడంతో పాటు నెలకు రూ.20వేల పింఛన్, 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో కలిమెల నర్సయ్య, అవిశెట్టి అవిలుమల్లు, నిలిగొండ మత్స్యగిరి, చిర్రబోయిన కొమురయ్య, విద్యాసాగర్, గొలుసుల కొండయ్య, రామచంద్రు, ఉప్పలయ్య, మచ్చగిరి, సురేష్ పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్‌లో తలకిందులుగా జాతీయజెండా!



జెండాను సరిచేస్తున్న కలెక్టర్

భానుపురి(సూర్యాపేట) : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జాతీయ జెండాను ఎగురవేశారు. అయితే, జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేసిన సిబ్బంది.. జాతీయ జెండాను తలకిందులుగా కట్టారు. జెండా ఆవిష్కరించే క్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ క్షణాల్లో ఈ విషయాన్ని గుర్తించారు. జెండాను ఆవిష్కరించగానే తలకిందులుగా కనిపించంతో వెంటనే గుర్తించిన కలెక్టర్.. జెండాను కిందకు దించి సరిచేసి ఎగురవేశారు.

అభివృద్ధిలో ఆదర్శం

- ప్రజారంజక పాలనతో ముందుకు
- ఆరుగ్యారంటీలు పక్కాగా అమలు
- రుణమాఫీతో రైతుల్లో ఆనందం
- జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలి
- స్వాతంత్య్ర వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, డీసీపీ

బస్వాపూర్ రిజర్వాయర్ తొలి విడత పనులు తుది దశకు చేరాయి. గంధమల్ల ప్రాజెక్టు పనులను కూడా త్వరలోనే ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. అధికారులు కలిసి కట్టుగా పనిచేసి యాదాద్రి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలి.

–గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గుత్తా



భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో జరిగిన వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



భరతమాత వేషధారణలో విద్యార్థిని

సాక్షి, యాదాద్రి : అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికంగా నిలిచిందని, ప్రజారంజక పాలనతో ప్రభుత్వం ముందుకెళ్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం, ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా 2,68,790 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటి వరకు 61,21, 544 మహిళలు ప్రయాణించారని వెల్లడించారు. రూ.500కు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ అందజేసేందుకు 1,16,408 మందిని అర్హులుగా గుర్తించామని, ఇప్పటి వరకు 2,35,790 సిలిండర్లు అందజేసి రూ.7.32 కోట్ల సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద మార్చి నుంచి 1,41, 810 మందికి జీరో బిల్ వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. రుణమాఫీ కింద మొదటి విడతలో 36,047 మంది రైతులకు రూ.198,11 కోట్లు, రెండవ విడతలో 17,991 మందికి రూ.176.12 కోట్లు మాఫీ జరిగిందన్నారు. మూడో విడత రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు గురువారం మాఫీ కానున్నాయని వెల్లడించారు.

'గంధమల్ల' పనులు త్వరలో ప్రారంభం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భువనగిరి మండలంలో రూ.1,571 కోట్ల అంచనా వ్యయం, 11.39 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న బస్వాపూరం (నృసింహసాగర్) రిజర్వాయర్ మొదటి విడత పనులు తుది దశకు చేరాయని శాసనమండలి చైర్మన్ తెలిపారు. గంధమల్ల రిజర్వాయర్ పనులను త్వరలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. అదే విధంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. యాదాద్రి జిల్లాలో 3,536 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయగా, రూ.10.17 కోట్ల సబ్సిడీ మంజూరు చేశామని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ కూలీలకు అత్యధిక పనులు కల్పించి రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ధరణి దరఖాస్తులు పురోగతిలో ఉన్నాయన్నారు. 97,738 దరఖాస్తులు అందులో 92, 255 దరఖాస్తులు పరిష్కరించినట్లు వెల్లడించారు. కలిసికట్టుగా పని చేసి యాదాద్రి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని కోరారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధుడు మన్నె గోపాల్‌రెడ్డిని సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న), ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టరు హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో తుక్కాపూర్, నర్సాపూర్‌కు బహుమతులు

స్వచ్ఛదనం-పచ్చదనంలో జిల్లాస్థాయిలో అగ్రభాగంలో నిలిచిన తుక్కాపూర్, నర్సాపూర్ గ్రామ పంచాయతీలకు బహుమతులు ప్రదానం చేశారు.



భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఆస్తుల పంపిణీ, శకటాల ప్రదర్శన

బ్యాంకు లింకేజీ రుణాలు రూ.164 కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు రూ.47 కోట్లు, స్త్రీనిధి రుణాలు రూ.11 కోట్లకు సంబంధించి లబ్ధిదారులకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే చెక్కులు పంపిణీ చేశారు. అదే విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్యారోగ్య, విద్య, అటవీ, ఆర్టీసీ, రెడ్‌క్రాస్, అగ్నిమాపక శాఖలు శకటాలను ప్రదర్శించాయి. ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రథమ, వ్యవసాయ శాఖ ద్వితీయ, విద్యాశాఖ తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, చేనేత జౌళి, పశు సంవర్ధక, నీటిపారుదల, ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖలతో పాటు లీడ్ బ్యాంక్ అమలుచేస్తున్న పథకాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆవిష్కరణలు తయారు చేసిన ఆవిష్కర్తలకు మెమెంటోలు అందజేశారు.ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు 8లో

మూడో విడతలో 13,011 మంది అర్హులు

- నేడు రైతుల ఖాతాల్లో జమకానున్న రుణమాఫీ డబ్బులు
- మొత్తం రూ.164.66 కోట్లు..

సాక్షి యాదాద్రి : రైతు రుణమాఫీ మూడో విడత కింద రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ కేటగిరీ కింద యాదాద్రి భువనగిరి జిల్లాలో 13,011మంది రైతులు ఉన్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం రూ.164.66 కోట్లు జమకానున్నట్లు అధికారులు ప్రకటించారు. మొదటి విడతలో భాగంగా రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది. 36,047 మంది రైతుల ఖాతాల్లో రూ.198.11 కోట్లు జమ చేసింది. రెండో విడతలో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు మాఫీ కాగా.. 17,991 మంది రైతుల ఖాతాల్లో రూ.176.12 కోట్లు వేసింది. రెండు విడతల్లో 54,038 మంది రైతుల ఖాతాల్లో రూ.374.23 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. మూడు విడతలు కలుపుకొని 67,049 మంది రైతులకు రూ.538.89 కోట్లు మాఫీ అవుతున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

అర్హులందరికీ 'గ్యారంటీ'

- సంక్షేమ పథకాలు అర్హుల దరి చేర్చేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలు
- కలెక్టరేట్, మున్సిపాలిటీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాటు
- దరఖాస్తుల్లో సమస్యలు, లబ్ధిదారుల ఎంపికలో తప్పిదాల సవరణ
- నూతన దరఖాస్తుల స్వీకరణకూ అవకాశం



కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం

భువనగిరిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలను అర్హుల దరి చేర్చేలా జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా ఇప్పటికే వేలాది మంది దరఖాస్తులు సమర్పించగా కొందరికి వివిధ కారణాలతో పథకాలు అందడం లేదు. వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. వారికి సహాయ సహకారాలు అందజేసేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 17 మండల అభివృద్ధి కార్యాలయాలు, ఆరు మున్సిపాలిటీలతో పాటు కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. అంతటా సేవలు మొదలయ్యాయి. ఈ కేంద్రాల్లో సెలవు దినాల్లో మినహా మిగతా అన్ని రోజుల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల అందుబాటులో ఉంటాయి.

తప్పులున్నా, జాబితాలో పేరు లేకున్నా..

ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500 వంట గ్యాస్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేస్తోంది. ఈ రెండు పథకాల కోసం ప్రజాపాలన ద్వారా లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. వాటిలో తప్పిదాల వల్ల చాలా మంది అర్హత ఉన్నా పథకాలకు దూరమవుతున్నారు. దరఖాస్తుల్లో సమస్యలున్నా, లబ్ధిదారుల ఎంపికలో తప్పిదాలు జరిగినా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సరి చేయనున్నారు. లోటుపాట్లను సరిచేయడమే కాకుండా అర్హులు పథకాల జాబితాలో లేకపోతే అందులో చేర్చనున్నారు.

తీసుకెళ్లాల్సిన ధ్రువీకరణ పత్రాలు

రేషన్ ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ బుక్, విద్యుత్ బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు నంబర్ ప్రతులను ప్రజాపాలన సేవా కేంద్రానికి తీసుకెళ్లాలి. ఆధార్, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్, గ్రామ పంచాయతీ పేరు సెలెక్ట్ చేసి దరఖాస్తు స్టేటస్ తెలుసుకోవచ్చు. గతంలో దరఖాస్తు చేసుకోనివారుంటే కొత్తగా చేసుకోవచ్చు.



భువనగిరి మున్సిపల్ ఆఫీసులోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

చిరుజల్లులు.. చిగురిస్తున్న ఆశలు

- కొద్ది రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలు
- పత్తి చేలకు అనుకూలం
- సాగు పనుల్లో రైతులు నిమగ్నం
- జిల్లాలో 1,00,514 ఎకరాల్లో పత్తి సాగు



పత్తి చేలో దుక్కి దున్నుతున్న రైతు

రామన్నపేట : జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలు పత్తి రైతుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో మొక్కలు ఎదగకుండా నిలిచిపోయాయి.మొక్క ఎదిగి పూతకు వచ్చే జూలై మాసంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులను ఆందోళనకు గురిచేశాయి. భూమి నుంచి సరైన పోషకాలు, ఎరువులు మొక్కకు అందక ఎదుగుదల కుంటుపడింది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరటనిస్తున్నాయి. రైతులు చేలలో గుంటుకలు తోలడం, కలుపు తీయడం, అడుగుమందు పెట్టడం, పురుగు మందులు పిచికారీ వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఏడాది కాలంగా భారీ వర్షాలు కురువక భూగర్భజలాలు అడుగంటి ఆయకట్టేతర ప్రాంతాల్లో వరిసాగు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో రైతులు పత్తిపైనే ఆశలు పెట్టుకున్నారు.

సాగు విస్తీర్ణం..

జిల్లాలో 1,12,514 ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ 1,00,514 ఎకరాల్లో సాగు చేశారు. రెండు వేల ఎకరాల వరకు సాగు విస్తీర్ణం తగ్గింది. వాతావరణం అన్ని విధాలా అనుకూలించినట్లయితే 50 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

పెరిగిన పెట్టుబడి

సాగు ఖర్చులు ఏటేటా పెరిగిపోతుంది. పత్తి ఎకరానికి రూ.25,000 నుంచి రూ.30,000 వరకు పెట్టుబడి వస్తుంది. గుంటుక, అచ్చుతోలే అరకలకు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు వెయ్యి రూపాయలు తీసుకుంటున్నారని, కలుపు తీయడానికి, మందులు పెట్టడానికి వచ్చే కూలీలకు రోజుకు రూ.500 చెల్లించాల్సి వస్తుంది.జూన్ మొదటి, రెండు వారాల్లో విత్తనాలు విత్తిన చేలు పూత దశకు వచ్చాయి. ఇప్పటికే రెండు పర్యాయాలు అడుగుమందు కూడా పెట్టారు. ఆలస్యంగా సాగు చేసిన చేలలో గుంటుకలు తోలడం, కలుపు తీయడం, అడుగుమందు పెట్టడం వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

మండలాల వారీగా పత్తి సాగు (ఎకరాల్లో)	
అడ్డగూడూరు	11,360
ఆలేరు	3,260
ఆత్మకూరు(ఎం)	3,945
గుండాల	9,000
మోత్కూరు	5,310
భూదాన్‌పోచంపల్లి	50
భువనగిరి	3,950
బీబీనగర్	32
వలిగొండ	6,700
చౌటుప్పల్	10,685
మోటకొండూరు	7,975
నారాయణపురం	24,723
రామన్నపేట	7,361
బొమ్మలరామారం	78
రాజాపేట	2,790
తుర్కపల్లి	395
యాదగిరిగుట్ట	2,900

మూడేళ్లుగా నష్టాలు వస్తున్నాయి



వెల్లంకిలో భూమి కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తుంటాను. అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడి రాక మూడేళ్లుగా నష్టపోతున్నా.రెక్కల కష్టం పోను పెట్టుబడులు మీద పడుతున్నాయి. ఈసారి నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. గత కొద్ది రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తుండడం మెట్ట పంటలకు అనుకూలిస్తుంది. ఈసారి గట్టెక్కుతానన్న ఆశతో ఉన్న.

–పిచ్చయ్య, వెల్లంకి, రామన్నపేట మండలం

ఈ రోడ్లు ఇంతేనా?

అసలే మట్టిరోడ్లు.. ఆపై అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. తారు వేయక, నిర్వహణకు నోచుకోక రూపురేఖలే మారిపోయాయి. అందుకు నిదర్శనమే ఆత్మకూరు(ఎం) మండలంలోని కప్రాయపల్లి– మోదుబావిగూడెం, రహీంఖాన్ పేట– పోతిరెడ్డిపల్లి, మొరిపిరాల – కాల్వపల్లి, మోదుబావిగూడెం – ఉప్పలపహాడ్ రహదారులు. రెండు, మూడేళ్లుగా తట్ట మట్టి కూడా పోసే వారు లేకపోవడంతో రోడ్డెక్కాలంటే వాహనదారులు వణికిపోతున్నారు. రాత్రి వేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

–ఆత్మకూర్ (ఎం)



కప్రాయపల్లి - మోదుబావిగూడెం రోడ్డు



రహీంఖాన్‌పేట - పోతిరెడ్డిపల్లి మార్గం..

నల్లగొండలో...


నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు


స్వాతంత్రోద్యమ నాయకుల వేషధారణలో విద్యార్థులు


మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు


నల్లగొండలోని డీసీసీబీ కార్యాలయంలో..

సూర్యాపేటలో...


స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


వడ్డీ లేని రుణాల చెక్ అందజేస్తున్న మంత్రి ఉత్తమ్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

యాదాద్రి భువనగిరిలో...


స్వాతంత్య్ర సమరయోధుడిని సత్కరిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర


భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


స్టాళ్లను పరిశీలిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఏర్పాటు చేసిన శకటంపై విద్యార్థులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులకు గుర్తింపు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు అవార్డులు అందజేశారు.


జిల్లా ఉపాధి కల్పనాధికారి పరాంకుశం సాహితీకి ఉత్తమ అవార్డు అందజేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి


వెంకటేశ్వర్లు, సీపీఓ
సురేష్, అడిషనల్ డీఆర్‌డీఓ
డాక్టర్ యశోధ డిప్యూటీ డీఎంహెచ్ఓ
జగన్‌మోహన్ ప్రసాద్ కలెక్టరేట్ పరిపాలనాధికారి
రామారావు, సూపరింటెండెంట్
పార్థ సింహారెడ్డి, సూపరింటెండెంట్


శ్రీకాంత్ సీనియర్ అసిస్టెంట్, ఎన్నికల విభాగం
వంశీకృష్ణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్
సయ్యద్ రఫీ, కలెక్టర్ సీసీ
శ్రీనివాసరావు, తహసీల్దార్, బొమ్మలరామారం
పల్లవి, నాయబ్ తహసీల్దార్
రాధాకృష్ణ, సీనియర్ అసిస్టెంట్
విజయరామారావు, సీనియర్ అసిస్టెంట్
పరిగి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్, వలిగొండ
నాగేశ్వర్‌రావు నాయబ్ తహసీల్దార్, పోచంపల్లి
ప్రియాంక, డబ్ల్యూటీసీ
వేణుకుమార్, కానిస్టేబుల్, భువనగిరి రూరల్


శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్, బొమ్మలరామారం
నరేందర్, కానిస్టేబుల్, భువనగిరి రూరల్
శ్రీను, కానిస్టేబుల్, చౌటుప్పల్
సైదులు, హోంగార్డు, రామన్నపేట
శివకుమార్, కానిస్టేబుల్, తుర్కపల్లి
శోభన్‌బాబు, డీపీఆర్‌ఓ సూపర్‌వైజర్
పావని, ఎంపీఓ, భువనగిరి
శ్వేత, ఏఈఓ
ఎండీ జైనోద్దీన్, కంప్యూటర్ ఆపరేటర్, ఆలేరు మున్సిపాలిటీ
లాయక్ అలీ, నాయబ్ తహసీల్దార్, సివిల్ సప్లయ్, భువనగిరి
రమణ, ఏపీఎం
రాధాకృష్ణ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, భువనగిరి
శంకర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, భువనగిరి
ఆనంద్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి
కొలుపుల రమేష్, సీనియర్ అసిస్టెంట్
రాకేష్, జూనియర్ అసిస్టెంట్


కృష్ణవేణి హాస్టల్ వెల్ఫేర్ అధికారి, ఆత్మకూర్ (ఎం)
ఎండీ పర్వీన్, ఎన్‌హెచ్ఎం
డాక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి
డాక్టర్ కరణ్‌రెడ్డి, భువనగిరి
హనిఫా బేగం, ఎఫ్ఎన్ఓ, భువనగిరి
ప్రకాశమ్మ, స్టాఫ్ నర్స్, సీహెచ్‌సీ చౌటుప్పల్
కాసిమ్మ, స్టాఫ్ నర్స్, భువనగిరి
మార్గం నరహరి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్
నిర్మల, పీఈటీ
తౌర్య, ఆర్టీసీ బస్సు కండక్టర్, యాదగిరిగుట్ట
యాదయ్య, ఆర్టీసీ బస్సు డ్రైవర్
మహ్మద్ ఉస్మాన్, ఎస్ఐ
సత్యం, హెడ్‌కానిస్టేబుల్
ఎండీ షఫీ అహ్మద్, కానిస్టేబుల్
మహేష్, కానిస్టేబుల్

17, 18 తేదీల్లో నల్లగొండలో అగ్రి షో

నల్లగొండ అగ్రికల్చర్: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో ఈ నెల 17, 18 తేదీల్లో అతిపెద్ద అగ్రికల్చర్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామని రైతుబడి యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు రాజేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. దేశ, విదేశీ సాంకేతికతతో పనిచేసే అనేక రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు ఈ ప్రదర్శనలో చూడవచ్చన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తయారుచేసే కంపెనీలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు సమీప జిల్లాల రైతులు ఈ ఎగ్జిబిషన్‌కు హాజరై సరికొత్త సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే వేలాదిమంది రైతులకు విజిటింగ్ పాసులు పంపిణీ చేశామని, పాసులు లేకున్నా ఎగ్జిబిషన్‌కు హాజరుకావచ్చని ఆయన తెలిపారు.


స్టాళ్ల కోసం వెలుస్తున్న గుడారాలు


డ్రోన్‌పై జాతీయ జెండా

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో డ్రోన్‌పై ఎగురవేస్తున్న జాతీయ జెండా

యువకుడి ఆత్మహత్యాయత్నం

- భార్య కాపురానికి రావడం లేదంటూ సెల్ఫీ వీడియోలో ఆవేదన


సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగుతున్న విజయ్

చివ్వెంల(సూర్యాపేట): భార్య కాపురానికి రావడం లేదంటూ మనస్తాపానికి గురైన యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం ఆవాస గ్రామం గుర్రతండాలో గురువారం జరిగింది. గుర్రతండాకు చెందిన ధరావతు విజయ్ గతేడాది అదే తండాకు చెందిన బానోతు నిఖితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. నిఖిత ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భవతి. కొద్దిరోజుల క్రితం నిఖితను ఆమె తల్లితండ్రులు పుట్టింటికి తీసుకెళ్లారు. ఇటీవల తన భార్యను తీసుకురావడానికి అత్తగారింటికి వెళ్లిన విజయ్‌ను రూ.50లక్షలు తన భార్య పేరిట డిపాజిట్ చేయాలని లేదా ఇల్లు, భూమి భార్య పేరు మీద రాయాలని అత్తంటి వారు డిమాండ్ చేస్తూ అతడిని కొట్టారు. తిరిగి అతడిపైనే కేసు పెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన విజయ్ తన భార్య తన వద్దకు రాకుండా అడ్డుపడుతున్న మామ బానోతు బాలాజీ, అత్త గీత, వారి పెద్ద కుమార్తె నందు, తన భార్య మేనమామలు మున్నా, వినోద్, బుజ్జి, లచ్చుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియోను పోస్ట్ చేశాడు. కుటంబ సభ్యులు గమనించి తండా శివారులో ఉన్న వ్యవసాయ భూముల్లో అతడి కోసం వెతకగా.. ఆచూకీ లభించడంతో వెంటనే సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ ఘటనపై తమకు సమాచారం అందిందని, యువకుడు ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి క్రైం: భువనగిరి – పగిడిపల్లి మధ్యన రైల్వే మెయిన్ లైన్ ట్రాక్‌పై గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ట్రాక్ పెట్రోలింగ్ మెన్ భువనగిరి రైల్వే స్టేషన్ మాస్టర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి, లేత ఆకుపచ్చ టీషర్టు, ఆకుపచ్చ నైట్ ప్యాంట్, నల్లటి షూ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 98482 22169, 87125 68454ను సంప్రదించాలని తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

భువనగిరి క్రైం: మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ చేసిన సంఘటన భువనగిరి పట్టణంలోని కిసాన్‌నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌బీనగర్‌కు చెందిన సిరికొండ భాగ్యలక్ష్మి భగవద్గీత పారాయణం కోసం కిసాన్‌నగర్‌కు వెళ్లి వస్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన దుండగులు ఆమె మెడలోని పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ


టోల్‌ప్లాజా వద్ద నెలకొన్న ట్రాఫిక్ జామ్

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై గురువారం వాహనాల రద్దీ పెరిగింది. దీంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి ప్రజలు వారి స్వగ్రామాలకు బయల్దేరారు. కొన్నింటికి ఫాస్ట్‌ట్రాక్ లేకపోవడంతో టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరాయి.

అదృశ్యమైన వ్యక్తి మృతి

- కల్వర్టులో మృతదేహం లభ్యం

భువనగిరి క్రైం: భువనగిరిలోని దోబివాడకు చెందిన తాపీ మేస్త్రీ రత్నపురం ముత్యాలు(52) ఈ నెల 11న అదృశ్యం కాగా.. బీబీనగర్ మండలంలోని గూడూరు సమీపంలో ఉన్న కల్వర్టులో గురువారం అతడి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.